# మీరాబాయి

## సామవేదం జానకిరామశర్మ గారు

మీరా రాఠోరు సామంతుని పుత్రిక. ఈమె బాల్యమునుండియు అలౌకికమగు రూపసౌందర్యమును మధురమగు కంఠస్వరమును గలిగియుండెడిది. ఆకాలమున ఈమె గానమును వినుటకును, సౌందర్యమును తిలకించుటకును చాలమంది జనులు రాఠోరుసామంతునికడకు వచ్చుచుండెడివారు. మీరా తన రూపలావణ్యముచేతను, గానమాధుర్యముచేతను ప్రజలను ముగ్ధుల నొనర్చుచుండెడిది. ఒకపరి చిత్తూరు యువరాజీమెగానమును, సౌందర్యమును ప్రజలవలన విని యిచ్చటకువచ్చి మీరాగానమును వినుచు చాలదినములుండెనట. చాలదినములవరకు యువరాజు రాకుండుటచే చిత్తూరు ప్రభువు చారులనంపి కుమారు నతికష్టముపై రాజ్యమునకు రప్పించెను. మీరాను వదలి వెళ్లుట కిష్టము లేకున్నను తండ్రి యాజ్ఞను మీరలేక వెళ్లునపు డాతడు మీరా కొకయంగుళీయకము నుపహారముగ నిచ్చి తనకామెయందుగల ప్రేమను వెల్లడి చేసెను.

ఆవల యువరాజు చిత్తూరు ప్రవేశించిన కొలదిదినములకే అచటనుండి చారు డొకడు రాఠోరురాజ్యమునకు మీరా వివాహవార్తనుదెల్పు శుభపత్రిక నొకటి దెచ్చెను కులశీలముల తగువరుడు లభింపనున్నాడని రాజు చిత్తూరుయువరాజునకు మీరానిచ్చి వివాహము గావించెను. వివాహమైన కొన్నిదినములకే యువరాజు రాణాయయ్యెను. మీరా బాల్యమునుండియు దైవభక్తిగలది. ఆమెకు సాంసారికభోగములం దనిష్టత మెండు. బాల్యమున పితృగృహమునందువలె విశాలమగు మైదానమున జనులందఱితో ముక్తకంఠమున భగవద్ధ్యానముచేయు నవకాశ మామెకు భర్తృగృహమున లభింపకుండెను. అన్నపానాదులులేక జనులెట్లుండజాలరో భగవద్ధ్యానములేక మీరా యట్లుండలేక పోయెడిది. భగవద్భక్తిలేక కాలము గడుపజాలని మీరా లోలోన చింతింపుచు యుదాసీనతతో దినముల గడుపుచుండెను. ఆమె భక్తి స్రోతస్సు సంగీతమార్గమున వెలువడుట కవకాశములేక యుదాసీనపథమున బ్రవహింపజొచ్చెను.

మీరా చదువను వ్రాయను బాగుగ నేర్చిన యువతీమణి. ఆమె రాజమహలునందుండి కవితాభ్యాసమున కారంభించెను. "రణచోడ్" దేవునుద్దేశించి యామె తన కవితాప్రాగల్భ్యమును దేశమునకు వెల్లడిపఱచెను. ఆమె సాహిత్యజ్ఞానము పండితశ్రేష్ఠుల మెప్పువడసినది. మీరా తన యనర్గళమగు కవితాధారచే చిత్తూరు రాజ్యమంతయు స్నిగ్ధమొనర్చెను. రాజస్థానమండలి కవిగణము నీమె తన స్వాధీన మందుంచుకొనెను. చిత్తూరు తన రాజ్యగౌరవమును క్షాత్రమునగాక మీరాయొక్క కవితాశక్తివలననే వృద్ధిపొందించుకొనినదన్న ఈమె కవితాశక్తి పాఠకులే యూహించుకొందురుగాక! మీరా వ్రాసిన భక్తిపాటలను భగవద్భక్తులందరును మిక్కిలి యాదరముతో గానముచేయుచుండెడివారు. మీరా కవిత్వమంతయు భక్తిరస పూరితమైయుండెడిది. "రాగగోవింద" మను భక్తిరసప్రధానమగు యుత్కృష్టగ్రంథ మీమెరచించినదే! జయదేవకృతమగు సంస్కృతగ్రంథమున కీమె టీక వ్రాసెను. పైనవ్రాసిన రెండు గ్రంథములును ప్రజల ప్రశంసనొందినవి. మీరాభర్తయగు కుంభరాణా ఈమెవలన కవితాశక్తిని సంపాదించెనని కూడ యొకానొక వాడుక గలదు. మీరా కవయిత్రియేగాక విశేషించి భక్తురాలనియు ధార్మికురాలనియు గూడ ప్రసిద్ధికెక్కెను. భర్తయనుకూలమున నీమె రాజమహలునందు "రణచోడ్" దేవునకొక మందిరము నిర్మింప

జేసెను. ఆమందిరమునకు భక్తులు వచ్చుట కెట్టియాటంకము నుండునది గాదు. స్త్రీపురుషభేదములేక యెల్లరు నచటికి వచ్చుచుండెడివారు. వారందరితో గలసి మీరా "రణఛోడ్ దేవు" నెదుట భగవత్కీర్తనము గానించుచుండెడిది. సాధారణజనులతో మీరా కలసిమెలసియుండుట గాంచినపుడెల్ల కుంభరాణాకు మిక్కిలి కష్టముగ నుండెడిది. ఇతర రాజులవలె రాణాయును భోగములందత్యాశ గలవాడు. ఐనను మీరా యతని కోర్కెల నెరవేర్ప జాలకుండెడిది. భోగలాలసుడగు రాణా ద్వితీయవివాహ మాడగోరి మీరాను పృచ్ఛసేయగా నామె యాతని యభిప్రాయమును సంతసముతో నంగీకరించెను. మీరా సమ్మతిపై నాతడు కన్యాన్వేషణమున కారంభించెను. ఝాలావార్ రాజకొమరిత సౌందర్యమును విని యామెను వివాహమాడ నిశ్చయించుకొనెను. గాని ఆమె నీవరకే మందార రాజునకియ్య నిశ్చయింపబడెను. ఇట్టిస్థితి యందాతడు వెనుదీయక సుముహూర్తము నాటి రాత్రి కామె నపహరించి చిత్తూరు జేర్చెను. పాపమా రాజకొమరిత మందార రాజుపై నత్యంతప్రేమ గలిగియుండెను. రాణా రాజకొమరితనే హరింప గలిగెను గాని యామె మనస్సును మాత్రము హరింపలేకపోయెను. ఎట్టులనో రాణాయామెను వివాహము గావించుకొనెను. కాని దాంపత్యసుఖము నాతడామెవలన యిసుమంతయు నొందియుండలేదని చెప్పుదురు. రాజమహాలు నందలి "రణఛోడ్ దేవ్" మందిరమునకు పేరికి వచ్చుట కాటంకము లేదని యిదివరకే చెప్పబడినది. ఒకానొక దినమున మందార రాజకుమారుడు వైష్ణవ వేషమూని రాజమహాలునకేతెంచి "రణఛోడ్ దేవ్" మందిరమున భక్తులందరితో గలసి విష్ణుగాన మొనరించెను. ప్రతిదినమును భక్తులందరు భగవద్గాన మొనర్చినపిదప ప్రసాదమును స్వీకరించి యింటికేగుట యాచారమైయుండెడిది. కాని ఆనాడు మందార రాజకుమారుడు ప్రసాదమును స్వీకరింపకపోగా జలపానము నైతము విసర్జించెను. అతిథిసత్కారమందత్యంతాసక్తిగల మీరా మిగుల ఖిన్నురాలై ప్రసాదస్వీకరణమునకై యాతని పలుభంగుల వేడుకొనెను. తుదకాతడు తాను కోరిన కార్యమును సఫలమొనర్చినచో ప్రసాదమును గ్రహింతునని భీష్మించ మీరాయందుల కొడంబడ నాతడు ప్రసాదమును స్వీకరించెను. పిమ్మట మందార రాజకుమారుడు ఝాలావార్ రాజపుత్రి తనయందనురక్తయగుటయు ఆమెను కుంభరాణా యపహరించుటయు, మొదలుగాగల సంగతులను జెప్పి ఆమె నొకపరి తనకు చూపించ వలసినదిగ మీరాను కోరెను.

రాజాంతఃపురమున పరపురుషప్రవేశము మిగుల భయానకము. ఐనను రాజపుత్రుని దీనస్థితియు తానొసగిన మాటయు దలంచి మీరా దుస్సాహసమున కొడిగట్టెను. మనుజుల కగోచరమగు రాజమహాలు నందలి గుప్తద్వారమును తెఱచి మీరా రాజపుత్రుని రాణా శయ్యామందిరమున కంపెను. కాని దౌర్భాగ్యవశమున రాణా యాసమయమున రాజపుత్రుని స్వాధీన మొనర్చుకొనుటకై శయ్యామందిరమున కొచ్చియుండెను. రాణా వైష్ణవవేషధారియగు రాజకుమారుని గుర్తించెను. రాజకుమారునకు రాణాను గాంచినంతనే మితిలేని భయము గలిగెను. మీరా సాయములేక ఆతడు అంతఃపుర ప్రవేశమొనర్పలేడని రాణా గ్రహించెను. మీరాను ద్వేషించుచున్న రాణా కీకార్యము మరింత క్రోధమును బురికొల్పెను. నిష్ఠురభాషణములనాతడు మీరా నిట్లాజ్ఞాపించెను. "అంతఃపుర గుప్తద్వారము నాయాజ్ఞలేక తెఱచినందులకు యీరాజ్యము వీడి పోవలసినది." ఇట్టి కఠోరవాక్కు నాలించియు మీరా యధీరగాలేదు. ఆమెకు రాజప్రాసాదమును రాజమార్గమును సమానములే! భర్తయాజ్ఞానుసారమున మీరా ఆ యుత్తరక్షణముననే రాజమహాలు వీడెను. చిత్తూరు ప్రజలకు మీరాయెడల భక్తిశ్రద్ధలు మెండు. మీరా వియోగముచే చిత్తూరు ఆనందరహితమైయుండెను. చిత్తూరు ప్రజలెల్లరు రాణాయెడ విముఖులైరి. ప్రజల

రీతి నాలసి రాణా మీరా నాలసి తీసికొని రావలసినదిగ నలుదిక్కులకు చారులనంపెను. మీరా వారిని గాంచి యిట్లనెను. "రాజాజ్ఞచే యింతదూరము వచ్చితిని. తిరిగి వారి యాజ్ఞాప్రకారమే చిత్తూరునకు వచ్చుచున్నాను." చారులతోఁగలసి మీరా చిత్తూరు ప్రవేశించెను. దయాహీనుడై రాణా యామె నితర రాజ్యముల కంపినను పతిదేవతగాన ఆమె యిసుమంతయు కోపగింపక చిత్తూరునకు వచ్చెను. ఇంతకు పూర్వ మామెకు రాజమహలునందు రణఛోడ్ దేవు నెదుట మాత్రమే భగవన్నుతిసేయుట కవకాశము కలిగెను. ఇప్పుడిచ్చవచ్చిన ప్రదేశమున భక్తులతోనేకమై హరిభజనసేయుట కవకాశ మేర్పడెను. మీరా భక్తిస్రోతస్సు చిత్తూరు రాజ్యమంతయు ప్రవహింపజొచ్చెను. పట్టణమందలి బాలురు, యువకులు, వృద్ధులు మీరా చేయు ధర్మకార్యములందామెకు సాయపడ సాగిరి. చిత్తూరుపట్టణమం దెచ్చట గాంచినను మీరా ధర్మకార్యప్రసక్తియే గానవచ్చుచుండెను. చిత్తూరుప్రజలను మీరా ధర్మస్వరూపులుగ నొనర్చెను. చిత్తూరుప్రజలెల్ల రామెను ధర్మస్వరూపిణిగ నెన్నుచుండిరి. మీరా సాధారణమానవులతో గలసి యుండుట గాంచి కొందరు దుర్మార్గు లామెను నిందింపసాగిరి. మీరా మధురగానము నాలకించి తన్మయులై యామె కుపహారముగ నాభరణముల నిచ్చిన వాటినన్నిటి నామె తనయిష్టదైవమగు రణఛోడ్ దేవునకు అలంకరించెడిది. ఆభరణస్వీకరణ విషయమైగూడ యవినీతిపరులు కొందరామెను సంశయింపసాగిరి. ఈవార్త రాణాకర్ణముల బడినంతనే క్రుద్ధుడై నదీజలమం దామె శరీరత్యాగ మొనర్చి కొనవలసినదిగా నాజ్ఞాపించెను. మృతి నొందుటకు పూర్వ మామె యొకపరి భర్తను జూడగోరెను. కాని నిర్దయుడగు రాణా యామెకు దర్శన మీయలేదు. భర్తయాజ్ఞానుసార మామె జలపూర్ణమగు నొకానొకనదియందు ధైర్యముతో నురికెను. ఆహా! ఎంత ఆశ్చర్యము! నదీతరంగబాహువు లామెను తమలో నిముడ్చుకొనుటకు మారామెను కనుగందనీక యొకానొకతీరమునకు జేర్చివైచినవి. ఈ విధముగ జ్ఞానాధిక్యతచే మీరా కాలినడకను బృందావనమునకు పయనమాయెను. రాజపత్నియగు మీరా కాలినడకను బృందావనమునకు పయనమగుట గాంచి జను లచ్చెరువొందిరి. నిరంతరము హరినామస్మరణ యందామె మగ్నయగుటచే మార్గశ్రమగాని ఆకలిదప్పులుగాని ఆమెను బాధింపనేరవాయెను. ఆమె యాగమనవార్త విని జను లెదురేగి తోడితెచ్చి యామెదర్శనమున పవిత్రుల మైతిమని సంతసించెడువారు. ప్రతిగ్రామవాసులును వేరొకగ్రామ మామె చేరువరకును వెంటనుండువారు. కొందరామెతో గూడ బృందావనమునకు పయనమైరి. మీరా బృందావనయాత్రయంతయు భక్తిస్రోతస్సుచే నిండిపోయెను. ఈ విధముగ ననేకవేలమంది యాత్రికులతో మీరా బృందావనము జేరెను. బృందావనమున శ్రీకృష్ణుని ధ్యానించుచు మీరా కొంతకాలముండెను. బృందావనమున మీరా యున్నకాలమున యనేకమంది భక్తు లీమెకు శిష్యులైరి.

రాణా ఈమె మహిమను విని తాను జేసినకార్యమునకు పశ్చాత్తాపముచెంది మీరా సామాన్యస్త్రీ గాదని తెలిసికొని, బృందావనమునకు స్వయముగనేగి యామెను చిత్తూరునకు రావలసినదిగ కోరెను. మీరా మొదటినుండియు పత్యాజ్ఞానువర్తిని యగుటచే చిత్తూరున కాతనితో వచ్చెను. చిత్తూరునందు మాత్ర మామె విశేషకాల ముండజాలక తిరిగి బృందావనము ప్రవేశించెను. రాణాకోరికపై మీరా తఱచు చిత్తూరునకు వచ్చి పోవుచుండెడిది. మీరా యంతిమకాలము తీర్థయాత్రయందు గడపెను. ఆమె భగవద్ధ్యానము సేయుచు భక్త్యావేశముచే తఱచుమూర్ఛితురాలగుచుండెడిది. చివరకొకానొక దినమున మీరా హరిభజన సేయుచు మూర్ఛనొంది భగవంతుని యందైక్యమయ్యెను. చిత్తూరునందు—నేటికిని రణఛోడ్ దేవునికి వలెనే మీరాకును ఉత్సవాదులు జరుగుచున్నవి.

(భారతవిదుషీమణులనుండి)